A1TV NEWS

APTEL 2023/16425

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 197 ఆదివారం మార్చి 03- 2024 పేజీలు 4. వేల :4 /

# టీఎంసీ అంటేనే అవినీతి: ప్రధాని మోదీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విమర్శలు చేశారు. బెంగాల్‌లో మొత్తం 42 సిట్లతో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో టీఎంసీని ప్రధాని మోదీ టార్గెట్ చేశారు.ఆయన శనివారం బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. 'టీఎంసీ అంటేనే అవినీతి. ఇక్కడికి వచ్చిన ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో చెబుతున్నా.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధిస్తుంది. టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోహానికి ప్రతిరూపం. బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు.సందేశ్‌ఖాలీ మహిళల విషయాన్ని ప్రస్తావిస్తూ... టీఎంసీ నేతలు సందేశ్‌ఖాలీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. బాధలో ఉన్న తల్లులు సోదరీమణులకు మద్దతు ఇవ్వాల్సింది పో?యి టీఎంసీ ప్రభుత్వం నిందితుల పక్షాన నిలబడుతోందని మోదీ విమర్శించారు. న్యాయం కోసం సందేశ్‌ఖాలీ మహిళలు ఎంత వేడుకుంటున్నా, నిరసనలు తెలిపినా టీఎంసీ ప్రభుత్వం మాత్రం వినిపించుకోలేదని మోదీ మండిపడ్డారు.



# తాగేందుకు నీళ్లు అడిగితే చంపేస్తారా?: పవన్ కల్యాణ్

మాచర్ల నియోజకవర్గంలోని మల్లవరంలో బాణావత్ సామునిబాయి అనే మహిళను ట్రాక్టర్ తో తొక్కించి చంపిన ఘటనపై జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఏపీలో తాగు నీళ్లు పట్టుకునేందుకు కూడా పార్టీల లెక్కలు చూసే పరిస్థితి రావడం దురదృష్టకరం అని పేర్కొన్నారు.

పల్నాడు జిల్లాలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన బాణావత్ సామునిబాయిని ట్రాక్టర్ తో తొక్కించి చంపిన ఘటన కలచివేసిందని తెలిపారు. తాగునీరు పట్టుకునేందుకు ఆమె ట్యాంకర్ వద్దకు వెళ్లడం, అవతలి పార్టీ వారు ఆమెను అడ్డుకోవడం, ఇంట్లో నీళ్లు లేవని ఆమె ప్రాధేయపడినా వినకుండా ట్రాక్టర్ తో ఢీకొట్టి చంపడం చూస్తే రాష్ట్రంలో ఎలాంటి దుర్మార్గపు పాలన ఉందో అందరూ అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

వైసీపీ వాళ్లే నీళ్లు తాగాలి, వైసీపీ వాళ్లే గాలి పీల్చాలి అనే జీవో ఇవ్వడం ఒక్కటే మిగిలి ఉంది అని పవన్ కల్యాణ్ విమర్శించారు. పంచభూతాలకు కూడా పార్టీ రంగులు పులిమే దుర్మార్గం రాజ్యమేలుతోందని మండిపడ్డారు.

మల్లవరం ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల కిందట ఇదే తరహాలో పల్నాడు జిల్లా నకరికల్లు ప్రాంతంలో ఎస్టీ మహిళలను వైసీపీ నాయకుడు ట్రాక్టర్ తో తొక్కించి చంపేశాడని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

"ఈ పాలకుడు మాట్లాడితే నా ఎస్టీలు, నా ఎస్సీలు అంటాడు. కానీ ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేస్తూ, ఎస్టీ మహిళలను ట్రాక్టర్లతో తొక్కించేస్తూ హత్యాకాండ సాగించేవాళ్లను వెనుకేసుకొచ్చే వ్యక్తికి నా ఎస్టీ, నా ఎస్సీ అనే అర్హత ఉందా?" అని పవన్ కల్యాణ్ నిలదీశారు.




# మళ్లీ మళ్లీ చెప్తున్నా మంగళగిరిలో వైసీపీ జెండా ఎగరేస్తాం

## -: ఎమ్మెల్యే ఆర్కే

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా గంజి చిరంజీవి స్థానంలో మురుగుడు లావణ్యను సీఎం జగన్ నియమించారు. ఈ మార్పుపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో చెప్పిన విధంగానే మంగళగిరి సీటు గెలిపించి జగనన్నకు కానుక ఇస్తామని ఆర్కే పునరుద్ఘాటించారు. తెలుగుదేశం పార్టీకి మరోసారి భంగపాటు తప్పదని అన్నారు.

"మళ్లీ మళ్లీ చెప్తున్నా మంగళగిరిలో వైసీపీ పార్టీ జెండా ఎగరవేస్తాం. రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన లావణ్య గెలుపు ఖాయం. 2024 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో నాన్ లోకల్, బీసీ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటుంద"ని ఎమ్మెల్యే ఆర్కే వ్యాఖ్యానించారు. కాగా, మంగళగిరి నుంచి టీడీపీ తరపున ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. నారా లోకేశ్‌నే ఎమ్మెల్యే ఆర్కే నాన్ లోకల్ అభ్యర్థిగా పేర్కొన్నారు.



ఎవరీ లావణ్య?

మురుగుడు లావణ్యకు పుట్టింటి నుంచి, మెట్టింటి నుంచి కూడా రాజకీయ నేపథ్యం ఉంది. లావణ్య తల్లి కాండ్రు కమల 2009 నుంచి 2014 వరకు మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2004 నుంచి 2009 వరకు మంగళగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. లావణ్య మామ మురుగుడు హనుమంతరావు ప్రస్తుతం ఎమ్మెల్సీగా, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. అంతకుముందు రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లోనూ చోటు దక్కించుకున్నారు.

# 175 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసిన కేంద్రం..

## - తొలగిపోనున్న పలు సమస్యలు

తెలంగాణ ప్రభుత్వానికి 175 ఎకరాల భూమిని కేంద్ర రక్షణ శాఖ బదిలీ చేసింది. ఈ భూములకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాయి. ఈ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన రక్షణ శాఖ... భూముల బదిలీకి అనుకూలంగా అనుమతులను ఇచ్చింది. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం కార్యాలయం స్పందిస్తూ... జనవరి 5న ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలను స్వీకరించిన తర్వాత... ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రక్షణ శాఖ పరిధిలోని భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రేవంత్ కోరగా... కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించిందని అన్నారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. మరోవైపు, ఈ భూములను తెలంగాణకు కేటాయించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా సంతోషం వ్యక్తం చేశారు. మోదీకి, రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల కామారెడ్డి మార్గం (ఎన్ హెచ్ 44), రాష్ట్ర రహదారి నెంబర్ 1లో సొరంగాల నిర్మాణం, ఎలివేటెడ్ కారిడార్లు సులభతరం అవుతాయని చెప్పారు. దేశ ప్రజలకు మోదీ ఇస్తున్న హామీలకు ఇది మరో నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్, రామగుండంలను కలుపుతూ నిర్మించే రాజీవ్ రహదారి కోసం 11.3 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ చేయాల్సి ఉందని చెప్పారు. ఇందులో కొంత భూమి రక్షణ శాఖ పరిధిలో ఉందని... కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికిందని అన్నారు.




## ఏపీలో అధికారంలోకి వచ్చేది

# టీడీపీ–జనసేన ప్రభుత్వమే

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నెల్లూరు సభలో మాట్లాడుతూ... ఏపీలో అధికారంలోకి వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు జగన్ తీరును భరించలేక టీడీపీలోకి వస్తున్నారని, ఇది ప్రారంభం మాత్రమేనని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక తిరుగుబాటు ఉధృతం అవుతుందని అన్నారు. వైసీపీ నాయకుడు అనే వాడు రోడ్డు మీద తిరగాలంటేనే భయపడే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు.

నాడు ఎగిరెగిరి పడ్డాడు!

ఇక్కడ నెల్లూరు నడి వీధిలో ఒక నాయకుడు మొన్నటి వరకు ఎగిరెగిరి పడ్డాడు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ఒంటి మీద బట్టలు కూడా నిలవలేదు... కన్నుమిన్ను కానలేదు... మన ఖర్మ కొద్దీ ఆయన కూడా మంత్రి అయ్యాడు. కానీ, మొన్న బదిలీల్లో ఒక్క తన్ను తంతే... ఒక్క జిల్లా కాదు మూడు జిల్లాల అవతలికి పోయి పడ్డాడు. బుల్లెట్ దిగిందా, లేదా అని ఒకప్పుడు డైలాగులు కొడుతుండేవాడు. ఇప్పుడు బుల్లెట్ కరెక్టుగా దిగింది. రేపు పల్నాడులో కూడా కరెక్టుగా బుల్లెట్ దిగుతుంది. ఈసారి తిరుగుటపాలో చెన్నైకి పోతాడు. ఇవాళ ఉంటుంది, రేపు ఉంటుంది, ఎల్లుండి ఉంటుంది... వైసీపీ నాయకులు జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తున్నాం.

విశాఖను దోచేసిన వ్యక్తిని నెల్లూరుకు తీసుకువచ్చారు!

ఇవాళ ఒకటి గమనించాలి. ఇక్కడ మీటింగ్ ఉందంటే, దీన్ని కౌంటర్ చేయడానికి, విశాఖపట్నంను దోచేసిన వ్యక్తిని నెల్లూరుకు పంపిస్తున్నారు. అక్కడ మొత్తం ఊడ్చేశాడు... ఇప్పుడు నెల్లూరుకు వచ్చాడు... నెల్లూరుకు వస్తే మిగిలేది ఏదీ ఉండదు. ఇలాంటి నాయకులను తిరుగుటపాలో పంపించేస్తారు మీరు... నాకు తెలుసు వీళ్ల తాట తీస్తారు మీరు.



# తెలంగాణలో అన్ని ఎంపీ స్థానాల్లో గెలుస్తాం: బండి సంజయ్

హుజూరాబాద్: ప్రజాహిత యాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందని భాజపా ఎంపీ బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్‌లోని శాయంపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు 350కి పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు.తెలంగాణలో అన్ని ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటామనే నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రక్షణశాఖ భూములివ్వడం హర్షణీయమన్నారు."ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలుచేసి తీరాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. తెల్ల రేషన్ కార్డు ఉన్నా.. రూ.500కు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులో కోత పెడుతున్నారు. 90 లక్షల వరకు రేషన్ కార్డు కుటుంబాలుంటే.. వాటిలో 50 లక్షల కుటుంబాలకు కోత పెట్టడం అన్యాయం.



కాంగ్రెస్, భారాస కుమ్మక్కై దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని బండి సంజయ్ ప్రశ్నించారు


# గత పదేళ్లలో తెలంగాణ శాసన సభను సరిగ్గా నిర్వహించలేదు

## -స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**శాసన సభలో ఏం జరుగుతుందో కూడా ప్రజలకు తెలియకపోయేదని వ్యాఖ్య**

**గత ప్రభుత్వం సభలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శ**

**కానీ కొత్త ప్రభుత్వంలో శాసన సభలో ఆరోగ్యకరమైన చర్చ జరుగుతోందన్న స్పీకర్**



గత పదేళ్ల కాలంలో తెలంగాణ శాసన సభను సరిగ్గా నిర్వహించలేదని, శాసన సభలో ఏం జరుగుతుందో కూడా ప్రజలకు తెలియకపోయేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం అసెంబ్లీలో దివంగత శ్రీపాదరావు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం సభలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. కానీ కొత్త ప్రభుత్వంలో శాసన సభలో ఆరోగ్యకరమైన చర్చ జరుగుతోందన్నారు.శాసనసభలో జరిగే చర్చను కోట్లాదిమంది ప్రజలు చూస్తుంటారని, చిన్న పిల్లలు కూడా శాసన సభలో జరుగుతున్న సమావేశాలపై చర్చించుకుంటున్నారన్నారు. శ్రీపాదరావు గురించి మాట్లాడుతూ... ఆయన అసెంబ్లీలో ఉన్న సమయంలో తాను లేనందుకు బాధగా ఉందన్నారు. శాసన సభ ఉన్నంత వరకు శ్రీపాదరావును స్మరించుకుంటారన్నారు.

# నంద్యాల వైసిపి మట్టి మాఫియా దళారులు, కుందూ నది గుట్టలను మాయం చేస్తున్నారు.

### -నంద్యాల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.ఎం.డి.ఫరూక్
### -తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి




ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:
నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలోని మట్టి మాఫియా నంద్యాల నుండి కర్నూలు వెళ్లే రహదారి పక్కన పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించిన స్థలాల ప్రక్కన భారీ ఎత్తున అక్రమంగా మట్టి మాఫియా గుట్టలను మాయం చేస్తుంది. అక్రమంగా సాగుతున్న మట్టి తవ్వకాలను చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఆఫీసర్లు నిర్లక్ష్యం అతి దారుణంగా ఉంది. అక్రమంగా సాగుతున్న తవ్వకాలు చూసి చూడనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు ఇండ్ల స్థలాల ప్రక్కన మట్టిని వదలని దళారులు, నంద్యాల జిల్లాలో మట్టి మాఫియా అధికార పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ప్రభుత్వానికి చెందిన కుందూ నది నంత దోపిడీ చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా వైనం మనకు కండ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వ భూముల్లో భూ దందా భారీ ఎత్తున కొనసాగుతుంది మట్టి అక్రమ దందా పెద్ద ఎత్తున రాత్రుల పూట ప్రోక్లైన్ ద్వారా మట్టిని తోడి ట్రాక్టర్ల ద్వారా యదేచ్ఛగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఇదే అదునుగా కోట్లకు పడగలెత్తుతున్న అధికార పార్టీకి చెందిన దళారులను ప్రభుత్వ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం అంతర్యం ఏమిటని తెలుగుదేశం పార్టీ నాయకుడు రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసి రెడ్డి జిల్లా అధికారులను ప్రశ్నించారు. మట్టి తవ్వకాలు యదేచగా కొనసాగిస్తూ మట్టి మాఫియా ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ట్రిప్పర్లు పెట్టి మట్టిని తోలుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదన్నట్లు తీరును చూస్తుంటే ఇందులో ఏదో మతలబు ఉన్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీ మట్టి దళారులపైన చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. అక్రమంగా మట్టిని తవ్విన ప్రాంతాన్ని కుందూ నదిని పరిశీలించిన వారిలో తెలుగు దేశం పార్టీ నాయకుడు యన్.ఎం.డి ఫిరోజ్, కాపు సామాజిక వర్గం నాయకుడు చింతల సుబ్బరాయుడు, తెలుగు దేశంపార్టీ ఒకటో వార్డు కౌన్సిలర్ పిచ్చుక నాగార్జున, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జూనియర్ న్యాయవాదులు, రామకృష్ణ యాదవ్, హేమేశ్ రెడ్డి మరియు టీ.టీ.ఆర్ అసోసియేట్ సభ్యులు పరిశీలించడం జరిగింది.

# నంద్యాలలో టిడిపి లీగల్ సెల్ కార్యాలయం ప్రారంభం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:
నంద్యాల పట్టణంలో స్థానిక శ్రీనివాస్ సెంటర్ నందు నంద్యాల టిడిపి లీగల్ సెల్ కార్యాలయాన్ని నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ చేత ప్రారంభించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు , తులసి రెడ్డి , టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ పి డి హెచ్ బాబు , నంద్యాల అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోళ్ల జయకృష్ణ మరియు సెక్రటరీ ప్రతాపరెడ్డి , టిడిపి లీగల్ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్ ఎన్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చిన ఈ లీగల్ సెల్ వారికి ఉపయోగపడుతుందని 2024 జరిగే ఎలక్షన్లలో ఈ వైఎస్ఆర్సిపి నాయకులు టిడిపి నాయకులను భయపడిచ్చి, బెదిరించి వారిపై కేసులు పెట్టే అవకాశాలు ఉన్నాయని అలాంటి సమయంలో ఈ లీగల్ సెల్ ని ఉపయోగించుకొని వాటి నుండి బయటపడాలని తెలియజేశారు. అలాగే ఈ కార్యాలయం ప్రారంభం ద్వారా లీగల్ సెల్ వారు ప్రతివారికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్,అడ్వకేట్ అడ్డగల్ల వెంకటేశ్వర్లు , ఆర్ నటరాజ్ , మాజీ పిపి టి మహమ్మద్ రఫీ , వైవి రమణారెడ్డి , సీ మద్దిలేటి , షేక్ ఇబ్రహీం ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఘనంగా జనసేన నాయకులు రాచమడుగు సుందర్ చందు జన్మదిన వేడుకలు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:
నంద్యాల జనసేన నాయకులు రాచమడుగు,సుందర్ ,చందు,జన్మదిన వేడుకలు. నిర్వహించిన,అభిమానులు. మున్సిపల్ ఆఫీసు నుండి దేవ నగర్ వరకు భారీ బైక్ ర్యాలీతో ,భారీ గజమాల, తో వెళ్లి సత్కరించిన అభిమానులు తరలివచ్చిన కార్యకర్తలు. కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించిన జనసేన నాయకులు నంద్యాల పట్టణం దేవనగర్ లో జనసేన నాయకులు రాచమడుగు సుందర్ ,చందు,స్వగృహం నందు
పుట్టినరోజు వేడుకులను జనసేన నాయకులు,కార్యకర్తలు,అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో నివాసం వద్ద సందడి ప్రారంభమైంది. అభిమానులు, మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం రాచమడుగు సుందర్ ,చందు, అభిమానులు గురు, చిన్న, రవి, భారీ గజమాల,తో వెళ్లి సత్కరించి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా నంద్యాల పట్టణమంత కేక్‌కట్ తో కార్యకర్తలు తమ అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్న రవి, గురు, సంజీవ రాయుడు, పవన్ ,బాబా ఫక్రుద్దీన్, అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





## 19వ వార్డు పొన్నాపురం కాలనీలో సీసీ రోడ్డు, డ్రైన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్పర్సన్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:
నంద్యాల మున్సిపాలిటీ పరిదిలోని 19వ వార్డు పొన్నాపురం కాలనీలో వార్డు కౌన్సిలర్ పరచూరి నారాయణమ్మ ఆద్వర్యంలో 60లక్షల గడపగడపకు మరియు సాధారణ నిధుల నుండి సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణపు పనులను ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నంద్యాల పట్టణంలోని 19వ వార్డు పొన్నాపురం కాలనీలో నూతనంగా సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంత్రంలో నేడు సీసీ రోడ్లు, అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతున్నదన్నారు. వార్డును భవిషత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు కృ షిచేస్తామన్నారు. కొత్తగా తెలుగుదేశం నాయకులు ఓట్ల కోసం మాయ మాటలు చెప్పి మాయ చేయడానికి వస్తున్నారు ప్రజలు కష్టాలలో ఉన్నప్పుడు ఒక్క తెలుగుదేశం నాయకులు కూడారాలేదని వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి రానున్న ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వమైన వైఎస్సార్సీపీని ఆశీర్వదించాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ పరుచూరి శ్రీరాములు, దేశం సుధాకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జంబులయ్య, మద్దిలేటి శెట్టి, కుమార్, కృష్ణ వెంకటేశ్వర్లు, రాజు, మధు గౌడ్, బోడెన్న, సంజన్న, కాజా శ్రీనివాసులు, సుబ్బయ్య, సందీప్, సుంకన్న, సుధాకర్, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం చంద్రబాబు పర్యటనకు హెలిపాడ్ పరిశీలించిన టిడిపి నాయకులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఈనెల 6వ తేదీ నంద్యాలకు వస్తున్న తరుణంలో నంద్యాలలో ప్రజా ప్రతినిధులు వారి పర్యటన పనులను చకచకా పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రివర్యులు ఎన్ ఎమ్ డి ఫరూక్ మరియు జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ శనివారం నాడు మాజీ సీఎం చంద్రబాబు పర్యటన నిమిత్తం నంద్యాల బొమ్మల సత్రం డిగ్రీ కాలేజ్ వెనకాల ఉన్న హెలిప్యాడ్ ల్యాండ్ అవ్వడానికి స్థలాన్ని పరిశీలించడం జరిగిందని వారు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఖచ్చితంగా ఈ పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# డోన్ ప్రభుత్వ వైద్యులకు ఘనంగా సన్మానం.



ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 02:
అవార్డు పొందిన డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ మహమ్మద్ అనీఫ్ కి మరియు సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ఎం. అనురాధ గారికి డోన్ వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో గవర్నమెంట్ డాక్టర్లకు సన్మానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఏఈ నాగరాజు, మహమ్మద్ రఫిలు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకి ఆదర్శంగా డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులు సేవలు అందిస్తున్నారని వీరి సేవలను గుర్తించిన నంద్యాల జిల్లా కలెక్టర్ గారు, ఎస్పీ జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ వైద్యులుగా గుర్తించి వీరికి అవార్డు ప్రశంసా పత్రం అందజేయడం జరిగినది. ఈ సందర్భం పురస్కరించుకొని డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉత్తమ సేవలు అందిస్తున్న సూపరిండెంట్ని గైనకాలజిస్టు డాక్టర్ గారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ డి ఆర్ కె రెడ్డి, డాక్టర్ యమున,డాక్టర్ జార్జ్ , డాక్టర్ కళ్యాణ బాబు, డాక్టర్ మాధవి, డాక్టర్ అపర్ణ కుమారి మరియు వైద్యశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మరియు హెడ్ సిస్టర్స్ ,స్టాఫ్ నర్సులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం నాయకులు ఊటకొండ చిన్నమద్దయ్య గారు, శ్రీరాములు గారు తదితరులు పాల్గొన్నారు.

# దొంగనోట్లు చలామణీదారులు అరెస్టు - డీఎస్పీ ఆర్.గోవిందరావు





విజయనగరం క్రైమ్, మార్చి 2 : నగరంలో గుమ్చి ప్రాంతంలో దొంగనోట్లు చలామణీ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 15 లక్షలు విలువైన దొంగనోట్లును స్వాధీనం చేసుకున్నట్లు విజయనగరం డిఎస్పి ఆర్.గోవిందరావు తెలిపారు.2వ పట్టణ పోలీసు స్టేషనులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకి సంబంధించిన వివరాలను డిఎస్పి గోవిందరావు వెల్లడించారు. 2వ పట్టణ సిఐ కోరాడ రామారావుకు వచ్చిన సమాచారం మేరకు 2వ పట్టణ ఎస్ఐ ఐ. దుర్గా ప్రసాద్, సిబ్బందితో విజయనగరం పట్టణం గుమ్చి ప్రాంతానికి చేరుకొని, అక్కడ అనుమానస్పదంగా సంచరిస్తున్న విజయనగరం వై.ఎస్.ఆర్.నగర్ కు చెందిన బంగారి చక్రధర్ అలియాస్ చక్రి,దత్తిరాజేరు మండలం గడసం గ్రామానికి చెందిన చంద్రమణిపాల్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 25 వేల చొప్పున నకిలీ కరెన్సీ 500 రూపాయల నోట్లను స్వాధీనం చేసుకున్నారు.నోట్లను పరిశీలించి, వారిని విచారణ చేయగా, తమకు ఈ నకిలీ నోట్లును చలామనీ చేసేందుకు ఒడిస్సా రాష్ట్రం జాపూర్ జిల్లా చెంచునార గ్రామానికి చెందిన చంద్రమణిపాల్ అనే వ్యక్తి విజయనగరం రైల్వే స్టేషను వద్ద 15,50,000 రూపాయలు విలువైన నకిలీ 500 రూపాయల కరెన్సీ నోట్లు ఇచ్చినట్లు, ఇందుకోసం తాము 3 లక్షల ఒరిజినల్ నోట్లును చంద్రమణిపాల్ కు చెల్లించేందుకు అంగీకరించినట్లు చెప్పారు.

ఎ-1 బంగారి చక్రధర్ పై ఇప్పటికే విజయనగరం 1వపట్టణ పోలీసు స్టేషనులో రెండు రేప్ కేసులు ఉన్నాయని, అతడిపై రౌడీ షీటు కూడా ఉందన్నారు బంగారి చక్రధర్ విజయనగరం సబ్ జైలులో రిమాండులో ఉండే సమయంలో గజపతినగరం కేసులో అరెస్టు కాబడిన ఒడిస్సాకు చెందిన చంద్రమణిపాల్ పరిచయం అయినట్లు, తాను దొంగనోట్లును చలామనీ చేస్తుంటానని, దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన రాజాన విష్ణు అనే వ్యక్తికి కూడా తానే దొంగనోట్లును సరఫరా చేస్తున్నట్లుగా తెలిపారు. అప్పటి నుండి వారితో స్నేహం కొనసాగిస్తూ వస్తున్నట్లుగా నిందితులు అంగీకరించారని విజయనగరం గోవిందరావు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న (ఎ-3) చంద్రమణిపాల్ నుపట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించామని, అతడిని పట్టుకొంటే దొంగనోట్లు ముద్రణ ఎవరు చేస్తున్నది, ఎక్కడ చేస్తున్నది, ఈ నేరంలో ఇంకెవరైనా పాత్రధారులు ఉన్నారన్న విషయాలు వెల్లడవుతాయని డిఎస్పి చెప్పారు.

# పుంగనూరులో 4న వాలంటీర్లకు సన్మానం



మార్చి 02

పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 16 సచివాలయాల పరిధిలో గల 202 మంది వాలంటీర్లకు ఈనెల 4న మున్సిపల్ కార్యాలయంలో సన్మానం చేయనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదేశాల మేరకు సేవ వజ్రా సేవారత్న సేవా మిత్రా అవార్డులు పంపిణీ చేస్తామన్నారు మున్సిపల్ చైర్మన్ హాలీం భాష పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు

# బెంగళూరుకు వెళ్లి పెన్షన్ అందించిన వాలంటీర్



మార్చి 02

పుంగనూరు పట్టణంలో తొమ్మిదవ వార్డులో గల వాలంటీర్ సంధ్య శనివారం బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెన్షన్ గారు సరస్వతికి పెన్షన్ పంపిణీ చేశారు వార్డ్ కౌన్సిలర్ అమ్ము సూచనల మేరకు వాలంటీర్ బెంగళూరులో చికిత్స పొందుతున్న వృద్ధురాలకు పెన్షన్ ఇవ్వడంతో ఆమె అభినందించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిరకాల ముఖ్యమంత్రిగా ఉండాలని ఆశీర్వదించారు

# రోటరీ ఆధ్వర్యంలో ఎండ్ పోలియోనౌ అవగాహన ర్యాలీ.




బొబ్బిలి

పోలియో ఆదివారాన్ని విజయవంత చేయండి

5 సం.లోపు పిల్లల నిండు జీవితానికి రెండుపోలియో చుక్కలు ఇప్పించాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు పిలుపునిచ్చారు.శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బొబ్బిలి సామజిక ఆరోగ్య కేంద్రం సహకారంతో పోలియో ని ఇప్పుడే నిర్మూలిద్దాం ర్యాలీ ని నిర్వహించారు. రోటరీ సభ్యులు, పి పి యూనిట్ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ ని నిర్వహించారు ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ ప్రపంచ పోలియో రహిత సమాజం కోసం రోటరీ గడచిన 35 సంవత్సరాల నుండి నిరంతరాయంగా కృషి చేస్తున్నదనిఅన్నారు పోలియో నిర్మూలానంలో రోటరీ పాత్ర అగ్ర స్థానంలో వుంటున్నదని అన్నారు. ప్రపంచములోవీచాలా దేశాలు పోలియో రహిత దేశాలుగా ప్రకటించుకున్నాయని ,రెండు దేశాలు ఆఫగనిస్థాన్, పాకిస్థాన్ దేశాల్లో మాత్రమే పోలియో వైరస్ కనిపిస్తున్నదని అన్నారు ఆ దేశాల్లో వైరస్ ని నిర్మూలించటానికి అంతర్జాతీయ రోటరీ సంస్థ ప్రపంచ ఆరోగ్య సంస్థతోని ,మిలింద బిల్ గేట్స్ సంస్థతో కలిసి పనిచేస్తున్నదని అన్నారు. నేడు ప్రపంచములో పోలియో నిర్మూలనంకు రోటరీ చేసిన కృషే కారణం అని అన్నారు. పి పి యూనిట్ వైద్యాధికారులు డాక్టర్ సంతోషి ,డాక్టర్ రెడ్డి రవికుమార్ మాట్లాడుతూ నేడు పోలియో ఆదివారం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని 36 కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందికి తగుసుచనలు జారీ చేశామన్నారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ లోవకుడా కేంద్రాలను ఏర్పాటు చేశామని షుమారుగా 5వేల పైగా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వారు తెలియ చేశారు.కార్యక్రమంలో రోటరీ సభ్యులు శ్రీ హరి, శ్రీనివాసన్, నాగరాజు, రామకృష్ణ, కృష్ణ మోహన వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# జనసేనలో చేరిన 50 కుటుంబాలు





భోగాపురం : మండలంలోని చిన రావాడ పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు, వైసీపీ పాలనకి విసుగు చెంది జనసేన పార్టీలో లోకం మాధవి ఆధ్వర్యంలో శనివారం వైసీపీని విడిచి జనసేనలో చేరారు . చినరావాడ కి చెందిన ప్రాంతవాసులు మాట్లాడుతూ తమకు గత 20 ఏళ్ల నుండి కనీసం రోడ్డు సదుపాయం లేదని ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన తమకి ఓట్ల కోసం హామీ ఇచ్చి ఎన్నికల తర్వాత కనబడకుండా వెళ్లేవారే అని, ఆ మాటలు నమ్మే 2019లో బడ్డు కొండ అప్పలనాయుడు కి ఓట్లు వేసి గెలిపించామని, కానీ తమకి ఇప్పటివరకు చేసింది ఏమీ లేదని వెల్లడించారు. లోకం మాధవి సేవ, ప్రజల మీద ఆవిడకి ఉన్న ప్రేమను తమ ప్రాంతానికి మంచి చేస్తారని నమ్మకంతో జనసేన పార్టీలో చేరడం అయినదని చినకారాడ ప్రజలు తెలియజేశారు.

# తన స్వంత బాబాయ్ హత్య కాబడి ఐదేళ్లు అవుతున్న పురోగతి ఎందుకు లేదు,

విజయనగరం : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి గారి హత్య కేసులో జగన్ మోహన్ రెడ్డి గారి పాత్ర విషయమై విచారణ జరగాలని నియోజకవర్గ ఇంచార్జ్, తెలుగుదేశం పార్టీ జనసేన విజయనగరం శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు డిమాండ్ చేసారు. వివేకానంద రెడ్డి గొడ్డలితో నరికి చంపారని జగన్ కి ముందు ఎలా తెలుసని ప్రశ్నించారు. అత్యంత కిరాతకంగా హత్య కాబడిన వ్యక్తి గుండె పోటు తో మరణించారని అబద్దపు మాటలు విజయసాయిరెడ్డి తో ఎందుకు చెప్పించారో సమాధానం చెప్పాలి. ఈ హత్య కేసులో మొదట సిబిఐ విచారణ కోరిన జగన్, అధికారం లో వచ్చిన తర్వాత సిబిఐ విచారణ పిటిషన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారో జవాబు చెప్పాలన్నారు, తన స్వంత బాబాయ్ హత్య కాబడి ఐదేళ్లు అవుతున్న పురోగతి ఎందుకు లేదు, కేసులో సంబంధం ఉన్న అవినాష్ రెడ్డి ని జగన్ ఎందుకు కాపాడుతున్నారు అని ప్రశ్నించారు. తన సోదరి సునీత రెడ్డి గారు అడుగుతున్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్ పై ఉంది అని అన్నారు. సునీత గారు చేస్తున్న న్యాయ పోరాటానికి తెలుగుదేశం తరపున మా మద్దతు ఉంటుందని తెలియజేసారు.

# పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల





విజయనగరం : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ శ్రేణులు ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ఈరోజు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి లాంచనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, దివంగత మహానేత వైయస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా జోనల్ వ్యవస్థతో ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు సమాయత్తమవుతున్న వేళ పార్టీ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృతంలో ప్రజా పాలన సాగిందన్నారు. అవినీతి లంచగొండితనం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయి వరకు చేరే విధంగా నూతన విధానానికి నాంది ప్రస్థానం చేశారన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అందుకే ఓట్లు అడిగే హక్కు తమకే ఉందని అన్నారు. ప్రజలను మభ్యపెట్టి, లేనిపోని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు.మారుమూల ప్రాంతాలలో సైతం అవసరమైన వారికి నీటి వసతిని కల్పించామని గుర్తు చేశారు. ప్రజలు ఏ అవసరమడిగినా ఈ ఐదేళ్లపాటు తీర్చగలిగామని అన్నారు. కరోనా వంటి కష్టకాలంలో వైసిపి శ్రేణులు ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కల్లబొల్లి మాటలు చెబుతున్న చంద్రబాబు నాయుడు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రజా మన్నలను పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బలపరిచి వైసిపి గెలిపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి,లయ యాదవ్, వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్చార్జిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 02:

నంద్యాల జిల్లా

జీత్ కునే డో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలలో ఉత్తీర్ణులైనటువంటి క్రీడాకారులకు వివిధ కరాటే బెల్ట్ లను ప్రదానం చేశారు.

జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బెల్ట్ ల ప్రదాన కార్యక్రమానికి జిల్లా జీత్ కునే డో కరాటే సంఘం అధ్యక్షుడు, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకు బెల్టులను, యోగ్యతా పత్రాలను అందజేశారు. ఆరు బ్లాక్, ఒక ఆరెంజ్, 15 బ్లూ, 22 గ్రీన్,80 ఎల్లో బెల్టులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ పిల్లలను చదువుతోపాటు క్రీడలలో, కళలలో ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అప్పుడే విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం జరుగుతుందని అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడ వలన బాలల్లో, యువతలో ఆత్మస్థైర్యం,శారీరక దారుధ్యం,ఏకాగ్రత,క్రమశిక్షణ అలవడతాయని తద్వారా వారు చదువులో కూడా చక్కగా రాణించడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నంద్యాల కార్యదర్శి సోమేశుల నాగరాజు, కరాటే మాస్టర్లు బాలకృష్ణ,లాల్ తరుణ్,ఉదయ సాయి కృష్ణ, తరుణ్,నాగేంద్ర,భరత్,నరేంద్ర, 150 మంది క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు




# ఎన్నికల ఫిర్యాదుల నమోదు వ్యవస్థలు ఏర్పాటు చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం , మార్చి 02 :

జిల్లాలో వచ్చే సాధారణ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఎన్నికలకు సంబంధించి వివిధ మార్గాల్లో ఫిర్యాదులను స్వీకరించే నిమిత్తం అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి ఆయా నోడల్ అధికారులను ఆదేశించారు. ఫోను ద్వారా ఫిర్యాదులను అందించేందుకు రెండు ఫోన్ నెంబర్లను ప్రత్యేకంగా ఎన్నికల ఫిర్యాదులకోసం ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, సి-విజిల్ యాప్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదుచేసి సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన కంప్లయింట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటుపై శనివారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదుకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే కంట్రోల్‌రూంలో వుంటూ విధులు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనితను ఆదేశించారు. ఈ విభాగాల్లో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, టి.వి.స్క్రీన్లు, కంప్యూటర్లు సమకూర్చడంపై ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. యీ విభాగంలో పనిచేసే సిబ్బందికి తగిన శిక్షణ కూడా ఇవ్వాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపేలా నివేదికలు రూపొందించి పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులన్నీ నమోదుచేసే అధికారిగా ముఖ్య ప్రణాళిక అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి.బాలాజీ, హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్, ఎన్.ఐ.సి. అధికారి బాలు, డి.పి.ఆర్.ఓ. డి.రమేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకరరావు, డి.టి. సూర్య, సమాచార శాఖ డి.ఇ. ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు



## రెడ్ చీరలో అందాల దివి కవ్వింపులు



టాలీవుడ్ లో ఉన్న చాలా మంది హీరోయిన్స్ తో పోల్చితే దివి అంతకు మించి అందంగా ఉంటుందని నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు బిగ్ బాస్ ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ దివి ఈ మధ్య కాలంలో స్టార్ హీరోయిన్స్ ను సైతం బీట్ చేసేంతటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంది. టాలీవుడ్ లో ఉన్న చాలా మంది హీరోయిన్స్ తో పోల్చితే దివి అంతకు మించి అందంగా ఉంటుందని నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో దివి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోలతో చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఆకట్టుకునే అందం తో పాటు అలరించే నడుము అందం చూపిస్తూ దివి ఇచ్చిన ఫోటో ఫోజ్ లు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సాధారణంగా అందమైన ముద్దుగుమ్మలు రెడ్ చీరలో నడుము అందం చూపిస్తూ ఉంటే చూపు తిప్పుకోలేం. అలాంటిది అందాల దివి తన యొక్క నడుము అందం చూపిస్తూ కవ్విస్తున్నట్లుగా ఫోజ్ ఇవ్వడంతో ఇంకేమైనా ఉందా... మతి పోయినంత పని అయ్యిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య చిరంజీవి సినిమాలో నటించే అవకాశం దక్కించుకున్న దివికి ఆశించిన స్థాయిలో టాలీవుడ్ నుంచి ఆఫర్లు రావడం లేదు. వెబ్ సిరీస్ ల్లో చిన్నా చితకా పాత్రల్లో నటించే ఛాన్స్ వస్తున్నాయి.. కానీ దివి మాత్రం మంచి ఆఫర్ కోసం వెయిట్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ముందు ముందు అయినా దివికి మంచి అవకాశాలు రావాలని ఫ్యాన్స్ అంతా కోరుకుంటున్నారు

## 'పుష్ప 2' క్లైమాక్స్ కోసం జపాన్ వెళ్లిందా?

పుష్ప 2 బృందం ఇప్పటికే ఈ చిత్రం పతాక సన్నివేశాలను జపాన్‌లో చిత్రీకరించాలని భావించిందని పుకార్ ఉంది. నేషనల్ క్రష్ రష్మిక ఇంటర్నేషనల్ క్రష్ అవ్వాలనుకుంటోందా? అంటే అవుననే గుసగుసలు వినిపిస్తున్నాయి. పుష్పలో శ్రీవల్లిగా నటించిన రష్మిక జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. రణబీర్ యానిమల్ చిత్రంలోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. ఇప్పుడు క్రేజీ లైనప్ తో కెరీర్ పరంగా ఉత్తమ దశలో ఉంది. తదుపరి రష్మిక నటిస్తున్న పుష్ప 2 సంచలనాలకు తెరతీయనుందని అంచనాలున్నాయి. ఈరోజు ఆకస్మికంగా రష్మిక టోక్యో విమానాశ్రయంలో ప్రత్యక్షమవ్వడం.. అక్కడ స్థానిక అభిమానులు తనను రిసీవ్ చేసుకున్న విధానం అబ్బురపరిచింది. రష్మిక సడెన్ గా జపాన్ ఎందుకు వెళ్లింది? అంటూ రకరకాల సందేహాలు పుట్టుకొచ్చాయి. అదే క్రమంలో పుష్ప 2 క్లైమాక్స్ చిత్రీకరణ కోసం టోక్యో వెళ్లిందని ఊహాగానాలు సాగాయి. పుష్ప 2 బృందం ఇప్పటికే ఈ చిత్రం పతాక సన్నివేశాలను జపాన్‌లో చిత్రీకరించాలని భావించిందని పుకార్ ఉంది. కానీ రెండవ భాగంలో కాకుండా 3వ భాగం కోసం జపాన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తారని గుసగుస వినిపిస్తోంది. నిజానికి టోక్యోలో 'క్రంచైరోల్ అనిమే' అవార్డుల్లో అతిథిగా పాల్గొనేందుకు రష్మిక జపాన్‌కు వెళ్లింది. యానిమేషన్ నేపథ్యంలో సినిమాలకు పురస్కారాలు అందించే వేదిక ఇది. ఇక భారతీయ సినిమాల్లోను జపనీ స్టైల్ యానిమేషన్ కి ప్రాముఖ్యత ఉంది గనుక .. మన దేశం నుంచి ప్రత్యేకించి రష్మికకు ఆతిథ్యం దక్కింది. రష్మిక ప్రస్తుతం ఈ అవార్డుల ఈవెంట్ కోసం మాత్రమే జపాన్‌లో ఉంది. ముంబై హైదరాబాద్ లో రష్మికకు బలమైన ప్రచార బృందం ఉంది గనుక.. తనను జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ప్రమోట్ చేయడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రస్తుతం రష్మిక కేవలం దేశీ సినిమాలతోనే సరిపెట్టుకోకుండా అంతర్జాతీయంగాను గుర్తింపు తెచ్చుకోవాలని భావిస్తోందని గుసగుస వినిపిస్తోంది.





## బుట్టబొమ్మ లా బంతాడే అందంతో!

చురకత్తితో గుచ్చితో గుండెలోతుల్లోకి దిగాల్సిందే. చురకత్తి పదును అలాంటిది. మరి అందం అనే చురకత్తితో గుచ్చితే! ఆ గాయం పోటు ఇంకెంత లోతుగా వెళ్తుందో చెప్పాల్సిన పనిలేదు. తాజాగా పటౌడీ వారసుడు సారా అలీఖాన్ అలాంటి పోటుకే కుర్రాకారుని గురి చేస్తుంది. ఇదిగో అమ్మడిలా అందంగా ముస్తాబైన వనమే అందుకు దారి తీసింది.

పాల నురుగుల సౌందర్యం పై చిలకాకు పచ్చ రంగు డిజైన్ గౌన్ లో సారా అలా మెరిసే సరికి ఆ బ్యూటీని చూడటానికి రెండు కళ్లు చాలవు అనిపిస్తుంది. బుట్ట డిజైన్ గౌనులో అమ్మడు అచ్చంగా బుట్టబొమ్మనే తలపించింది. శ్వేత వర్ణం స్కిన్ టోన్ పై ఆ రంగు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అందులోనూ సారా ధరించే సరికి ఆ దుస్తులకు కొత్త అందమే జత అయింది. ఇక అమ్మడు ఎంపిక చేసుకున్న యాక్సర సీస్ ..మ్యాకప్ ప్రతీది మరింత అందంగా తీర్చి దిద్దాయి.

వేలికి పొడితో కూడిన రింగ్..చెవులకు పెట్టిన దిద్దులు అన్ని సారాని మరింత అందగా మార్చేసాయి. అమ్మడు అలా ముఖం 30 డిగ్రీల కోణం తిప్ప కెమారాకి ఫోజు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జా లంలో వైరల్ గా మారింది. సారా అభిమానులు అమ్మడి అందాన్ని ఆకాశానికి ఎత్తకుండా ఉండలేకపోతు న్నారు. లుక్స్ గార్జియస్...బ్యూటీఫుల్ లేడీ అంటూ తమదైన శైలిలో కామెంట్ల వర్షం గుప్పిస్తున్నారు.

ఇక సారా కెరీర్ సంగతి చూస్తే బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. 'గ్యాస్ లైట్'..'జర్ హట్ కే జర బచ్ కే'..'యే వతన్ మేరా వతన్' లాంటి విజయాలతో రెట్టింపు ఉత్సాహంలో ఉంది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో హిందీలోనే ఐదారు సినిమాలు రెడీగా ఉన్నాయి. అవన్నీ షూటింగ్ దశలో ఉన్నాయి. అవి గాక కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నాయి. నటిగా డే బైడే షైన్ అవుతుంది

## అది నెపొటిజం ఎలా అవుతుంది..?

తాజాగా ఒక కార్యక్రమంలో దిశా పటానీ మాట్లాడుతూ... నేను మోడలింగ్ చేస్తున్న సమయంలో నాలోని నటిని గుర్తించిన వ్యక్తి కరణ్ జోహార్. సినిమా ఇండస్ట్రీలో మెగా హీరో వరుణ్ తేజ్ 'లోఫర్' తో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ దిశ పటానీ. టాలీవుడ్ లో కెరీర్ ఆరంభించినప్పటికీ మొదటి సినిమా నిరాశ పరచడంతో బాలీవుడ్ లో బిజీగా ఉంది. అక్కడ చేసిన సినిమాలు మరియు పాత్రలు మంచి గుర్తింపు తెచ్చి పెట్టడంతో ప్రస్తుతం మోస్ట్ పాపులర్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. హీరోయిన్ గా దిశ పటానీ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు చాలానే ఉన్నాయి. చాలా కాలం తర్వాత సౌత్ లో కూడా ఈ అమ్మడు ప్రభాస్ కు జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా ఈ అమ్మడు ఇంత బిజీ గా ఉండటానికి కారణం ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్ అంటూ తాజా చిట్ చాట్ లో పేర్కొంది. తాజాగా ఒక కార్యక్రమంలో దిశా పటానీ మాట్లాడుతూ... నేను మోడలింగ్ చేస్తున్న సమయంలో నాలోని నటిని గుర్తించిన వ్యక్తి కరణ్ జోహార్. నాలో ఉన్న ప్రతిభను చూసి ఆయన అవకాశం ఇచ్చారు. అంతే తప్ప నేను స్టార్ కిడ్ అని కాదు, మరేదో కారణం వల్లో కాదు. నా ప్రతిభకు కరణ్ జోహార్ ఇచ్చిన ఆఫర్స్ ను కొందరు నెపొటిజం అంటూ విమర్శలు చేస్తున్నారు. నేను ఇండస్ట్రీలో అడుగు పెట్టిన తర్వాత హిట్స్ అంత సులభంగా రాలేదు. చాలా కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. నెపోటిజం తో వచ్చిన వారు కష్టపడకుండా స్టార్స్ అవ్వగలరా అంటూ ఆమె ప్రశ్నించింది. ఇండస్ట్రీలో నెపోటిజం అంటూ గతంలో తీవ్రమైన చర్చ జరిగేది. కానీ ఇప్పుడు కాస్త సైలెంట్ గానే పరిస్థితి ఉందని చెప్పాలి. ఇలాంటి సమయంలో దిశా పటానీ నెపోటిజం గురించి మాట్లాడటం, వారసత్వం ఉన్నంత మాత్రాన ఇండస్ట్రీలో అడుగు పెడితే నెపోటిజం అవ్వదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. దీని పై నెటిజన్స్ ఎలా రియాక్ట్ అవుతారు అనేది చూడాలి.



## కల్కి కోసం ప్రభాస్.. సూపర్ అప్‌డేట్



ఇప్పుడు కల్కి సినిమా యొక్క షూటింగ్ ను ముగించిన ప్రభాస్ డబ్బింగ్ పనులకు రెడీ అవుతున్నాడు అంటూ ప్రచారం జరుగుతోంది. సలార్ సినిమాతో గత ఏడాది చివర్లో బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ప్రభాస్ అభిమానులకు చాలా ఊరట కలిగించాడు. వరుసగా మూడు పరాజయాల తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన సలార్ సూపర్ డూపర్ హిట్ అవ్వడంతో ఆయన ప్రస్తుతం చేస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో కల్కి సినిమా గురించి రెగ్యులర్ గా ఏదో ఒక వార్త, పుకారు సర్క్యులేట్ అవుతూనే ఉంది. ఇప్పుడు కల్కి సినిమా యొక్క షూటింగ్ ను ముగించిన ప్రభాస్ డబ్బింగ్ పనులకు రెడీ అవుతున్నాడు అంటూ ప్రచారం జరుగుతోంది. తెలుగు తో పాటు మరో రెండు భాషలకు కూడా ప్రభాస్ డబ్బింగ్ చెప్తాడు అంటున్నారు. ఆ రెండు భాషలు ఏంటి అనేది తెలియాల్సి ఉంది. ప్రభాస్ వచ్చే వారంలోనే కల్కి సినిమా కోసం డబ్బింగ్ చెప్పబోతున్నాడు. పరిస్థితులను బట్టి రెండు లేదా మూడు రోజుల పాటు కల్కి సినిమా డబ్బింగ్ వర్క్ జరిగే అవకాశాలు ఉన్నాయట. ఇప్పటికే పలువురు నటీ నటులకు సంబంధించిన డబ్బింగ్ వర్క్ పూర్తి అయ్యిందని, వచ్చే వారంతో డబ్బింగ్ ఫార్మాల్టీస్ అంతా కూడా పూర్తి ఇవ్వబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇక సినిమా విడుదలే తరువాయి అన్నట్లుగా హడావుడిగా పరిస్థితి ఉంది. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడ్డ కల్కి సినిమాను సెంటిమెంట్ డేట్ అయిన మే 9న విడుదల చేయబోతున్న విషయం తెల్సిందే. ఇప్పటికే ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ మరో వైపు గ్రాఫిక్స్ వర్క్ విషయంలో మరింత స్పీడ్ పెంచాడు. మార్చి చివరి వరకు సినిమా యొక్క ఫస్ట్ కాపీ రెడీ చేసి ఏప్రిల్ నుంచి ప్రమోషన్ కార్యక్రమాలు షురూ చేసే విధంగా యూనిట్ సభ్యులు హడావుడిగా ఉన్నారు. పాన్ ఇండియా మించి ఈ సినిమా విడుదల చేయబోతున్నారు. బాలీవుడ్ స్టార్స్ అమితాబచ్చన్, దీపికా పదుకునే, దిశా పటానీ ఇంకా పలువురు ప్రముఖులు ఈ సినిమాలో నటించారు